సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం। 30। ఏప్రిల్। 2025

I



అర్హులకు అందేనా..?
ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారులు ఎంపిక సర్వేలో జరుగుతున్న తప్పులతో కొందరు అర్హులు ఇబ్బంది పడుతున్నారు. IIలో



లక్ష్యం వైపు పయనం..
నష్టాలతో నడుస్తున్న జీసీసీని లాభాల బాట పట్టించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. IIలో

గరిష్టం / కనిష్టం
41°/ 26°

వాతావరణం
జిల్లాలో బుధవారం ఎండ అధికంగా ఉంటుంది. ఉదయం నుంచే అధిక ఉష్ణోగ్రత నమోదవుతూ మధ్యాహ్నానికి తీవ్రంగా మారుతుంది.

న్యూస్‌రీల్

రమణీయం.. రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం
భద్రాచలంటౌన్: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏలూరు జిల్లాకు చెందిన నారాయణ–రుక్మిణీదేవి దంపతులు మంగళవారం రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది వారికి స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందించారు. ఆలయ పీఆర్వో సాయిబాబు తదతరులు పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించాలి

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్



మాట్లాడుతున్న జడ్జి రాజేందర్

కొత్తగూడెంటౌన్: చెక్ బౌన్స్ కేసుల్లో రాజీమార్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ అన్నారు. కొత్తగూడెం జిల్లా కోర్టులో బ్యాంకు, ఆర్థిక సంస్థల అధికారులు, ప్రతివాదులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 9 నుంచి 14వ తేదీ వరకు లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీఎస్ అధికారులకు ఎస్పీ అభినందన



ప్రశంసాపత్రాలు పొందిన వారితో ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ఈనెల 26న ప్రశంసాపత్రాలు అందుకున్న సీసీఎస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ రోహిత్‌రాజు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆంధ్రా – ఒడిశా ఆటవీ ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని సమర్థంగా అడ్డుకోవడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, సిబ్బంది రవి, విజయ్, రామకృష్ణ భాస్కర్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ప్రయాణికుల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి, నిరంతరం నిఘా పెంచుతున్నట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మట్టే సాయి తెలిపారు. భద్రతపై రైలు ప్రయాణికులకు, నిబంధనలపై ఆటో డ్రైవర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి స్టేషన్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రైల్వే ట్రాక్‌లను దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వదిలేసిన లగేజీలను గుర్తిస్తే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని, భద్రాచలం రోడ్డులోని ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్!



నెల్లిపాక బంజరలో సీసీఐ కొనుగోలు చేసిన పత్తి

సీసీఐ కేంద్రాల్లో భారీగా అక్రమాలు ?
- టీఆర్‌ల జారీలో అవకతవకలపై చర్యలకు రంగం సిద్ధం
- ఇప్పటికే మార్కెట్ కార్యదర్శులకు నోటీసులు
- క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు

బూర్గంపాడు: సీసీఐ పత్తి కొనుగోళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీనిపై గతంలోనే ప్రాథమిక విచారణ చేసి పది మందికి పైగా మార్కెట్ కార్యదర్శులు, డీఎంఓలను సస్పెండ్ చేయగా భద్రాచలం మార్కెట్ కార్యదర్శిపై కూడా వేటు పడింది. సీసీఐ పత్తి కొనుగోళ్లకు సంబంధించి టీఆర్(టెంపరరీ రిజిస్ట్రేషన్)ల జారీలో భారీగా అక్రమాలు జరిగాయని ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలోనే అక్రమాలకు పాల్పడిన అధికారుల్లో వణుకు మొదలైంది. జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్లు ఉండగా నాలుగు మార్కెట్ల ఆధ్వర్యంలో సీసీఐ పత్తి కొనుగోళ్లు జరిగాయి. ఆయా మార్కెట్లలోనూ టీఆర్‌ల జారీలో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. బూర్గంపాడు, భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు మార్కెట్ల అధికారులకు విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

పాస్‌బుక్‌లు లేని రైతుల కోసం..
జిల్లాలో నాలుగు సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేశారు. ఆయా కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చే రైతులు.. తాము ఏ సర్వే నంబర్ భూమిలో ఎంత విస్తీర్ణంలో పత్తి సాగు చేశామనే వివరాలపై వ్యవసాయ శాఖ అధికారులతో ముందుగానే క్రాప్ బుకింగ్ చేసుకోవాలి. వారు ఇచ్చిన బుకింగ్ ఆన్‌లైన్ లిస్ట్ ఆధారంగా మార్కెటింగ్ శాఖ అధికారులు ధ్రువీకరిస్తేనే సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు చేస్తారు. అయితే పట్టాదారు పాసు పుస్తకాలు లేని రైతులు, పోడు సాగు చేసుకుంటున్న వారు పత్తి అమ్ముకునేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. దీంతో అలాంటి వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం టీఆర్ ప్రక్రియ ప్రారంభించింది. పట్టాదారు పాసు పుస్తకాలు లేని రైతులు తమ భూమి వివరాలను ముందుగా వ్యవసాయ అధికారులకు తెలియజేసి పత్తి వేసినట్లు నమోదు చేసుకోవాలి. అయితే చిన్న, సన్నకారు రైతులకు ఈ ప్రక్రియపై అవగాహన లేకపోవడంతో టీఆర్‌కు దూరంగా ఉండగా.. వ్యాపారులు, దళారులు మాత్రం దీన్ని తమ కు అనుకూలంగా మార్చుకున్నారు. కొందరు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులను ప్రసన్నం చేసుకుని తమ బంధువుల పేర్లతో టీఆర్‌లు పొందారు. వాటి ఆధారంగా గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతుల నుంచి పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేసి సీసీఐలో ఎక్కువ ధరకు అమ్ముకున్నారు.

రైతులను ఆరా తీసిన అధికారులు

ఇల్లెందురూరల్/అశ్వాపురం : సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి అమ్మకాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. అశ్వాపురం మండలం రామచంద్రాపురం, ఇల్లెందు మండలం కొమరారం గ్రామాల్లో మంగళవారం పర్యటించిన అధికారులు.. ఎంత విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు.. సీసీఐ కేంద్రంలో ఎన్ని క్వింటాళ్లు అమ్మారు.. డబ్బులు ఎవరి ఖాతాల్లో జమయ్యాయి అంటూ రైతుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. కొమరారంలో 148 టీఆర్ కూపన్ల ద్వారా పత్తి విక్రయించగా అన్నింటిపైనా ఆరా తీసి, వివరాలు నమోదు చేశారు.

వ్యాపారుల మధ్య విభేదాలతో..

అధికారులు కొందరు వ్యాపారులకే టీఆర్‌లు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో వ్యాపారుల మధ్య విభేదాలు ఏర్పడి ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేసుకున్నారు. దీనికి రాజకీయ రంగు పులుముకోవడంతో ఈ వ్యవహారం ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లగా.. ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో కొందరు మార్కెటింగ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవడమే కాక విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. జిల్లాలోని కొన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా టీఆర్‌లకు రికమండ్ చేశారని, మార్కెటింగ్ అధికారులు సైతం ఎలాంటి పరిశీలన లేకుండానే ఆన్‌లైన్ చేశారని విచారణలో వెల్లడైనట్టు తెలిసింది. దీంతో మార్కెట్ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి టీఆర్ పుస్తకాలను పరిశీలిస్తున్నారు. ఒక టీఆర్‌పై రైతులు గరిష్టంగా 110 క్వింటాళ్ల పత్తి మాత్రమే అమ్ముకునే అవకాశం ఉండగా.. కొన్నిచోట్ల ఒక రైతు పేరున 200 నుంచి 300 క్వింటాళ్ల పత్తి విక్రయాలు జరిగినట్లు కూడా తెలుస్తోంది. మంగళవారం కూడా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ అక్రమాల వ్యవహారంలో సీసీఐ అధికారుల ప్రమేయం, జిన్నింగ్ మిల్లుల నిర్వాహకుల పాత్రపై కూడా విచారణ సాగుతున్నట్లు సమాచారం. అక్రమాలకు పాల్ప డిన వారిపై వేటు తప్పదనే ప్రచారం సాగుతోంది.

కొండరెడ్ల అభివృద్ధే లక్ష్యం



కొండరెడ్లకు ఉపకరణాలు అందిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే ఆదినారాయణ, పక్కన కలెక్టర్ పాటిల్, ఎస్పీ, ఐటీడీఏ పీఓ తదితరులు

- వచ్చే ఏడాది నాటికి గోదావరి జలాలు తీసుకొస్తాం
- శంకుస్థాపన, ప్రారంభోత్సవాలపై స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వాలి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

దమ్మపేట : కొండరెడ్ల జీవన స్థితిగతులను అధ్యయనం చేసి, వారి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. మండల పరిధిలోని పూసుకుంట, కటుకూరు అటవీ మార్గంలో సుమారు రూ.5 కోట్లతో నిర్మించిన మూడు హై లెవల్ వంతెనలను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి తుమ్మల మంగళవారం ప్రారంభించారు. అనంతరం పూసుకుంటలో నిర్వహించిన సమావేశంలో కొండరెడ్లు ఉమ్మల నారాయణమ్మ, యాట్ల కాంతారెడ్డికి భద్రాచలం ఐటీడీఏ ద్వారా మంజూరైన టెంట్‌హౌస్, సౌండ్ సిస్టంలను, మరో ఐదుగురికి తేనెటీగల పెంపకం సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొండరెడ్ల వ్యవసాయ క్షేత్రాల్లో చెట్లు నరకకుండా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని ఆ శాఖ ఎస్ఈ మహేందర్‌కు సూచించారు. డ్రైవింగ్‌లో నైపుణ్యం గల కొండరెడ్ల యువతను గుర్తించి, లైసెన్స్‌లు ఇప్పించాలని, ప్రజా రవాణా కోసం రెండు వాహనాలు అందజేయాలని ఐటీడీఏ పీఓ రాహుల్‌ను ఆదేశించారు. పోడు భూముల్లో పచ్చదనం పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు సూచించారు. జిల్లా స్థాయి అధికారులు నెలలో ఒక్కసారైనా పూసుకుంట, కటుకూరు గ్రామాలను సందర్శించి, స్థానికుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ఆయా గ్రామాల రైతులు పామాయిల్, మునగ పంటలు సాగు చేసేలా ఉద్యాన అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కొండరెడ్లకు పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలపై స్థానిక ఎమ్మెల్యేకు ముందుగా సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది నాటికి దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు గోదావరి జలాలు తీసుకొస్తామని అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కొండరెడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. పాత రెడ్డిగూడెం, గోగులపూడి గ్రామాల్లో అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, పూసుకుంట అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరుచేశామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, ట్రైనీ కలెక్టర్ శర్మ, డీపీఓ చంద్రమౌళి, ఆర్‌డీఓ మధు, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, సీడీపీఓ హేమసత్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం

టూర్ షెడ్యూల్‌లో లేకుండా, తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బీటీ రోడ్డు శంకుస్థాపనకు శిలాఫలకం ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆర్‌అండ్‌బీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పర్యటన సందర్భంగా ఆర్లపెంట క్రాస్‌రోడ్డు సమీపంలో ఏర్పాటుచేసిన శిలాఫలకం వద్ద కాన్వాయ్‌ని ఆపి, కొబ్బరికాయ కొట్టి బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయాలని ఎమ్మెల్యేను మంత్రి తుమ్మల కోరారు. దీంతో కంగుతిన్న ఎమ్మెల్యే.. తన నియోజకవర్గ పరిధిలోని బీటీ రోడ్డు శంకుస్థాపనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, టూర్ షెడ్యూల్‌లో కూడా లేకుండా ఎలా ఏర్పాటు చేశారంటూ ఆర్‌అండ్‌బీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం మంజూరైన రోడ్డుకు ఇప్పుడు శంకుస్థాపన ఏంటని ప్రశ్నించారు. దీంతో తుమ్మల.. ఎమ్మెల్యేను సముదాయిస్తూ కొబ్బరికాయ కొట్టాలని కోరగా 'మీరంటే గౌరవం ఉంది కానీ, అధికారులు ముందుగా చెప్పకుండా ఏర్పాటు చేసిన శంకుస్థాపన చేయలేను' అంటూ తెగేసి చెప్పారు. తన మనోభావం దెబ్బతిందని, వంతెనల ప్రారంభోత్సవానికి కూడా రానంటూ వెళ్లిపోతుండగా తుమ్మల ఎమ్మెల్యే చెయ్యి పట్టుకుని తన కారులో ఎక్కించుకున్నారు. జారే అనుచరుడు చిన్నశెట్టి యుగంధర్ మంత్రి కారు ఎక్కొద్దంటూ వారించడమే కాక కారును అడ్డగించే ప్రయత్నం చేశారు. దీంతో తుమ్మల వారిని సముదాయించి తర్వాత మాట్లాడుకుందాం అంటూ తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎమ్మెల్యేను తన కారులోనే ఎక్కించుకున్న తుమ్మల బీటీ రోడ్డు శిలాఫలకం వద్ద ఆపి, ప్రారంభోత్సవం చేయాలని కోరారు. దీంతో యుగంధర్ ఎమ్మెల్యేను వారించగా సముదాయించిన తుమ్మల మొదట అతడితోనే కొబ్బరికాయ కొట్టించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఆదినారాయణ కూడా టెంకాయ కొట్టి మంత్రితో పాటు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.



ఆర్‌అండ్‌బీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

భూ భారతితో సమస్యల పరిష్కారం

- కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి
- బూర్గంపాడు, భద్రాచలంలో ఎమ్మెల్యేలతో కలిసి సదస్సులు



భద్రాచలంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎమ్మెల్యే వెంకట్రావు, పీఓ రాహుల్ తదితరులు

బూర్గంపాడు/భద్రాచలంటౌన్ : భూముల సమస్యల శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ చట్టంపై బూర్గంపాడు, భద్రాచలంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఈ చట్టం ద్వారా భూముల హక్కులు, రికార్డులు భద్రంగా, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రికార్డుల్లో సవరణలు, మ్యుటేషన్, వారసత్వ హక్కులు, సాదా బైనామాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ చట్టంతో గిరిజన, గిరిజనేతరుల భూములకు కూడా భద్రత ఉంటుందని భరోసా ఇచ్చారు. భూ సమస్యలపై గతంలో కోర్టులను ఆశ్రయించే వారని, ఈ చట్టంతో షెడ్యూల్ (ఏ)ను ఏర్పాటు చేసి భూమి విలువ రూ.5 లక్షల లోపుంటే ఆర్డీఓ స్థాయిలో, అంతకు ఎక్కువుంటే కలెక్టర్ స్థాయిలో పరిష్కరించే అవకాశం ఉంటుందని వివరించారు. కలెక్టర్ స్థాయిలో కూడా పరిష్కారం కాకుంటే సీసీఎల్ఏకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి రెవెన్యూ శాఖను చిన్నాభిన్నం చేసిందని, రైతుల భూములకు భద్రత కల్పించేందుకు ప్రస్తుత ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంత గిరిజన రైతులు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, ఏడీఏ తాతారావు, తహసీల్దార్లు ముజాహిద్, శ్రీనివాసరావు, బూర్గంపాడు ఎంపీడీఓ జమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ కలెక్టర్



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న శర్మ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాకు నూతనంగా నియమితులైన ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందించగా కలెక్టర్ ఆయనను అభినందించారు.

రేక్ పాయింట్‌కు ఎరువుల వ్యాగన్

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన రేక్ పాయింట్‌కు మంగళవారం తొలిసారిగా ఎరువుల వ్యాగన్ చేరుకుంది. ఈ సందర్భంగా ఎరువుల కంపెనీ ప్రతినిధులతో కలిసి దిగుమతిని ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రైల్వే మూడో లైన్ ఏర్పాటుతో ఖమ్మం నుంచి తొలగించిన రేక్ పాయింట్‌ను పందిళ్లపల్లి స్టేషన్‌లో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. తద్వారా ఎరువుల సరఫరాకు నాలుగు నెలలుగా ఆటంకాలు ఎదురవుతున్నా, ఇప్పుడా సమస్య పరిష్కారమైందని చెప్పారు. తొలిసారిగా విశాఖపట్నంలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ప్లాంట్ నుంచి 1,300 టన్నుల ఎరువులు చేరాయని తెలిపారు. గ్రోమోర్ కంపెనీ జనరల్ మేనేజర్ సజన్, జిల్లా అధికారి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపించాలి

ఆర్‌ఎం సరిరామ్

చుంచుపల్లి: అధికారులు, సిబ్బంది సమష్టిగా పని చేస్తూ కొత్తగూడెం ఆర్టీసీ డిపోను అభివృద్ధి పథంలో నడిపించాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం డిపోలోని పలు సెక్షన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు అందించాల్సిన సేవలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఉద్యోగులంతా సమష్టిగా పని చేస్తూ సంస్థను లాభాల బాట పట్టించాలన్నారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు నడపాలని సూచించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన పలువురు ఉద్యోగులను సత్కరించారు. ఆర్‌ఎం వెంట డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న సరిరామ్

ఆదివాసీలకు అందుబాటులో ఉంటాం..

చర్ల: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ఆదివాసీలకు నిత్యం అందుబాటులో ఉంటామని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ పేర్కొన్నారు. ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని మావోయిస్టు ప్రభావిత గ్రామమైన ఎర్రంపాడులో సీఐ రాజువర్మతో కలిసి కమ్యూనిటీ కనెక్ట్‌లో భాగంగా ప్రతీ ఇంటిని సందర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, దుస్తులు పంపిణీ చేశారు. ప్రతీ గ్రామానికి విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ్, కార్తీక్ పాల్గొన్నారు.



ఆదివాసీలు, పిల్లలతో ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

చుంచుపల్లి: కొత్తగూడెం, ఇల్లెందు పట్టణ పరిసర ప్రాంతాల ఆర్టీసీ ప్రయాణికులకు సమస్యల పరిష్కారం కోసం బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచనలు, సలహాలు, ఫిర్యాదుల కోసం 99592 25959 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అటవీ ఉత్పత్తులను డీఆర్ డిపోలో విక్రయించాలి


మాట్లాడుతున్న మేనేజర్ నరసింహారావు

గుండాల: అటవీ ఉత్పత్తులను డీఆర్ డిపోలో విక్రయించే సౌకర్యం కల్పించామని జీసీసీ మేనేజర్ నరసింహారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ ఉత్పత్తులను మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దని, గిరిజన సహకార సంస్థ ద్వారా కిలో ముష్టి గింజలు రూ.75, కుంకుళ్లు రూ.40, ఇప్పపూలు రూ.30, ఇప్పపలుకు రూ.29, కరక్కాయ రూ.15, కానుగకాయ రూ.10తో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్ బూసేయ్య, జీసీసీ సేల్స్‌మెన్లు పూనెం లక్ష్మయ్య, గలిగ చెన్నయ్య, అంబటి శ్రీనివాస్, మోల్కం పగడయ్య పాల్గొన్నారు.

జెడ్పీకి గుండాల ఎంపీడీఓ డిప్యూటేషన్

గుండాల: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున గుండాల ఎంపీడీఓ సత్యనారాయణను డిప్యూటేషన్‌పై జెడ్పీకి బదిలీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం, ఉపాధి హామీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జాప్యంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావడం లేదనే ఆరోపణలు రాగా.. జిల్లా అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో మంగళవారం ఎంపీడీఓ సత్యనారాయణను జిల్లా పరిషత్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సామల శ్రీనివాసరావుకు గుండాల ఎంపీడీఓగా నియమిస్తూ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

కలప స్వాధీనం..

ట్రాక్టర్ సీజ్.. కేసు నమోదు


స్వాధీనం చేసుకున్న కలప

కరకగూడెం: అక్రమంగా అటవీ ప్రాంతంలో చెట్లు నరికి గుట్టుచప్పుడూ కాకుండా కలప తరలిస్తున్న వ్యక్తిని ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. ఏడూళ్ల బయ్యారం రేంజర్ తేజస్వి కథనం ప్రకారం.. రేగుళ్ల గ్రామానికి చెందిన కొండగొర్ల సమ్మయ్య మంగళవారం అనంతారం బీట్ పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి టేకు, బిల్లుడు, చెన్నంగి, కొడిశ వాసాలను తన ట్రాక్టర్‌లో ఇంటికి తరలిస్తున్న క్రమంలో ఫారెస్ట్ సిబ్బంది స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కలప విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందన్నారు. తనిఖీల్లో ఎఫ్ఎస్ఓలు సూరయ్య, ఏడుకొండల్, బీట్ ఆఫీసర్ రోజా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేలా నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడాన్ని నిరసిస్తూ వచ్చేనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఖమ్మంలో అఖిలపక్ష కార్మిక సంఘాల బాధ్యులు మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శులు శింగు నర్సింహారావు, జె.వెంకటేష్, కె.సూర్యం, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్వంచ కృష్ణ మాట్లాడారు. కార్మికుల కోసం అమల్లో ఉన్న ప్రతీ హక్కు వెనక దశాబ్దాల పోరాటం దాగి ఉందని తెలిపారు. వీటిని కాలరేసేలా ప్రయత్నిస్తున్న కేంద్రానికి గుణపాఠం చెప్పేందుకు సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గాదె లక్ష్మీనారాయణ, నరాల నరేష్‌నాయుడు, విష్ణువర్ధన్, ఏ.వెంకటరెడ్డి, ఐ.వెంకన్న, తోట రామాంజనేయులు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జి.రామయ్య, నీలం రాజేష్, పటేల్ పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

అర్హులకు అందేనా..?

- 2,22,587 దరఖాస్తులు.. 3,182 మంది అర్హులు
- మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ
- వార్డు మాజీ కౌన్సిలర్ల పెత్తనంపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం


అర్హుల జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. కానీ, సర్వేలో జరుగుతున్న తప్పుల కారణంగా కొందరు అర్హులు ఇబ్బంది పడుతున్నారు. మండలాల్లో సర్వే పూర్తయి అర్హులను తేల్చినప్పటికీ.. మున్సిపాలిటీల్లో ప్రక్రియ కొనసాగుతోంది. అయితే, కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీల్లో గత జనవరిలో మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగిసింది. కాగా, ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో వార్డు మాజీ కౌన్సిలర్లు సభ్యులుగా ఉండటాన్ని అన్ని వర్గాల వారు వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ నుంచి కమిటీ సభ్యులు ఉండడంతో ఒకరి మాట ఒకరు వినే పరిస్థితి లేదు. దీంతో వార్డు ఆఫీసర్ ఎవరి మాట వినాలో తెలియక అవస్థ పడుతున్నారు. వార్డు మాజీ కౌన్సిలర్లు వారికి దగ్గరి వ్యక్తులు, బంధువులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని, దీంతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతోందని పలువురు చెబుతున్నారు. పలు నిబంధనలు క్రమబద్ధీకరణ పట్టాలు లేని వారికి అవరోధంగా పరిణమించాయి. వర్షం కాలం వస్తే పడిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లను సైతం కమిటీ సభ్యులు, వార్డు ఆఫీసర్లు అర్హత లేని వాటిగా గుర్తించడం రాజకీయ పెత్తనాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

అనర్హులు ఎవరు?

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను గ్రామసభల్లో ప్రకటించినప్పుడు ఆందోళన వ్యక్తమైంది. అలా గొడవలు జరుగకుండా కమిటీ సభ్యులు, వార్డు మాజీ కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు రహస్యంగా ఎంపిక చేస్తున్నారు. మొదటి దశ ఎల్-1లో స్థలం ఉండి ఇళ్లు లేని వారు, ఎల్-2లో స్థలం, ఇళ్లు లేని వారు అర్హులు. ఎల్-3లో కారు, సొంత ఇల్లు, దారిద్ర్య రేఖ ఎగువ ఉన్న వారిని చేర్చి అనర్హులుగా ప్రకటించాలి. కానీ, ఇక్కడే సభ్యులు, ఆఫీసర్ల మధ్య వ్యత్యాసాలు వస్తున్నాయి. గతంలో ప్రకటించిన ప్రకారం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తే.. వార్డుకు 5 నుంచి 10 మాత్రమే ఇళ్లు వస్తాయని, దశలవారీగా మంజూరు చేస్తామని చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తులు ఇలా..

జిల్లాలోని అన్ని మండలాల్లో కలిపి 2,22,587 వరకు దరఖాస్తులు వచ్చాయి. అధికారులు తొలుత 22 గ్రామ పంచాయతీల్లో పైలట్ ప్రాజెక్టు కింద తొలి దశలో 3,182 మందిని అర్హులుగా తేల్చి ప్రక్రియను కొనసాగిస్తున్నారు. అలాగే, మున్సిపాలిటీల్లో జరుగుతున్న సర్వేపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముందని పలువురు చెబుతున్నారు.

మున్సిపాలిటీల్లో కొనసాగుతోంది..

జిల్లాలోని మండలాల్లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సర్వే పూర్తయింది. 22 గ్రామ పంచాయతీలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశాం. మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హుల ఎంపిక ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.

– శంకర్, హౌసింగ్, పీడీ

లక్ష్యం వైపు పయనం..

- ఈ ఏడాది రూ.145 కోట్ల వ్యాపారమే లక్ష్యంగా జీసీసీ కార్యాచరణ
- గిరిజనుల నుంచి ఉత్పత్తుల సేకరణ
- సేల్స్‌మెన్లకు దిశానిర్దేశం చేసిన అధికారులు


జీసీసీ భద్రాచలం డివిజన్ కార్యాలయం


ఇటీవల సేల్స్‌మెన్లతో ఇల్లెందు జీసీసీ బ్రాంచ్ పరిధిలో నిర్వహించిన సమావేశం (ఫైల్)

ఇల్లెందు: అటవీ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పెంచినా వాటి ద్వారా ఆదాయం మాత్రం ఆశించినంత రావడం లేదు. నిత్యావసర సరుకుల విక్రయం, అటవీ ఉత్పత్తుల సేకరణ, వాటిని విక్రయించి లాభాలు ఆర్జించటం లేదు. దీంతో జీసీసీ లక్ష్య సాధనలో విఫలమవుతోంది. కానీ, ఈ దఫా గ్రామస్థాయి నుంచి అధికారుల స్థాయి వరకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, సమష్టి కృషితో పనిచేసి సంస్థను బలోపేతం చేసేందుకు నిర్ణయించింది. అటవీ ఉత్పత్తుల సేకరణతో పాటు మంచి ధరలకు నిత్యావసర వస్తువులను విక్రయించాలనుకుంటున్నారు.

డివిజన్ లక్ష్యం ఇలా..

ఇటీవల భద్రాచలంలో జరిగిన జీసీసీ డివిజనల్ స్థాయి సమావేశంలో చర్చించిన అంశాలను కింది స్థాయికి తీసుకెళ్లాలని సూచించగా బ్రాంచ్ స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించారు. ఇల్లెందు బ్రాంచ్‌లో రూ.64.70 కోట్లు, భద్రాచలం రూ.21.88 కోట్లు, దమ్మపేట రూ.39.89 కోట్లు, పాల్వంచ రూ.17.60 కోట్లు, మణుగూరు రూ.18.85 కోట్ల వ్యాపారం చేయాలని, మొత్తంగా భద్రాచలం డివిజన్‌లో 2025–26లో రూ.145 కోట్ల వ్యాపారం చేయాలని నిర్ణయించారు. గిరిజనుల నుంచి సేకరించిన ఫల ఉత్పత్తుల విక్రయం, డీఆర్ డిపోల ద్వారా బియ్యంతో పాటు నిత్యావసరాలు విక్రయించడంతోపాటు అటవీ ఉత్పత్తులు కరక్కాయ, చిల్ల గింజలు, కుంకుడు కాయ, ఇప్ప పువ్వు, ఇప్పబద్ద, ముష్టిగింజలు, నరమామిడి చెక్క, జిగురు సేకరణపై దృష్టిసారించటమే లక్ష్యం.

అటవీ ఉత్పత్తులే కీలకం..

జీసీసీ డీఆర్ డిపోల ద్వారా ముష్టిగింజలు కిలో ధర రూ.75 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. డివిజన్ పరిధిలో భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు, దమ్మపేట బ్రాంచ్‌ల్లో 149 డీఆర్ డిపోలున్నాయి. ఇల్లెందు బ్రాంచ్ పరిధిలోని గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, బయ్యారం, మణుగూరు బ్రాంచ్ పరిధిలో పినపాక, పాల్వంచ, దమ్మపేట మండలాల్లో ఈ దఫా సుమారు 3 వేల క్వింటాళ్ల ముష్టిగింజలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సంస్థ వ్యాపార లక్ష్యం..

డివిజన్‌లో వ్యాపార లక్ష్యం రూ.145 కోట్లు కాగా అటవీ ఉత్పత్తుల కొనుగోలుతో రూ.3.50 కోట్లు, వ్యవసాయేతర ఉత్పత్తుల ద్వారా రూ.30 కోట్ల వ్యాపారం, పెట్రోల్‌బంక్‌ల ద్వారా రూ.80 కోట్ల వ్యాపారం చేయనున్నారు. హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలకు బియ్యం సరఫరాతో రూ.50 లక్షలు, కాస్మొటిక్స్ సరఫరాతో రూ.23.50 కోట్లు, గ్యాస్ సరఫరాతో రూ.2 కోట్లు, ఇతర వస్తువుల సేల్స్‌తో రూ.5.50 కోట్లు లక్ష్యంగా జీసీసీ ఎంచుకుంది.

లక్ష్యం దిశగా కృషి సాగుతోంది..

ఈ దఫా డివిజన్ పరిధిలో లక్ష్యం దిశగా వ్యాపారాభివృద్ధి కోసం కృషి చేయాలని పట్టుదలతో ఉన్నాం. ఇప్పటికే ఒక దఫా సమావేశం నిర్వహించాం. మరోమారు సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఈ దఫా రూ.145 కోట్లు లక్ష్యంగా డివిజన్‌లో జీసీసీ కార్యాచరణ ఉంటుంది.

–కె.సమ్మయ్య, డీఎం, భద్రాచలం, డివిజన్

నిరుపేద ఇంట్లో నిప్పుల కుంపటి

- గ్యాస్ లీకేజీ.. పక్కనే కట్టెల పొయ్యితో మంటలు
- ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో నలుగురు


తీవ్రగాయాలతో రోదిస్తున్న చిన్నారులు

తల్లాడ: అప్పటి వరకు ఆనందంగా గడిపిన ఆ కుటుంబ సభ్యుల్లో అంతులేని విషాదం నెలకొంది. ఇంట్లోని పిల్లలే కాక వేసవి సెలవులకు వచ్చిన సోదరి పిల్లలు సైతం అగ్నిప్రమాదంలో చిక్కుకోవడం.. ఇద్దరు మృతి చెందగా, ఇంకో నలుగురు చికిత్స పొందుతుండడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. తల్లాడ మండలం మిట్టపల్లిలో జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

సిలిండర్ మారుస్తుండగా...

మిట్టపల్లికి చెందిన గుత్తికొండ వినోద్ ఇంట్లో సోమవారం రాత్రి గ్యాస్ సిలిండర్ అయిపోయింది. దీంతో మరో సిలిండర్ తీసుకొచ్చిన ఆయన రెగ్యులేటర్ బిగిస్తున్నాడు. ఈక్రమాన సిలిండర్ మూత తీయగానే గ్యాస్ లీకేజీ కావడం.. సమీపాన కట్టెల పొయ్యి వెలుగుతుండడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో మంటలు వంటగదిలో నుంచి వరండాలోకి వచ్చాయి. అక్కడ వినోద్ కవల కుమారులైన వరుణ్‌తేజ్, తరుణ్‌తేజ్(7), నాయనమ్మ సుశీల(65), వేసవి సెలవుల్లో మేనమామ అయిన వినోద్ ఇంటికి వచ్చిన సత్తుపల్లి మండలం నాచారానికి చెందిన ఆయన చెల్లెలు లావణ్య పిల్లలు ప్రిన్సీ, లింసీ ఉన్నారు. దీంతో వారందరినీ మంటలు చుట్టుముట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో వినోద్ కూడా గాయపడగా.. ఆయన భార్య రేవతి సరుకుల కోసం సమీప షాప్‌నకు వెళ్లడంతో ప్రమాదం నుంచి బయటపడింది. మంటలను గుర్తించిన స్థానికులు హుటాహుటిన చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆతర్వాత తరుణ్ తేజ్, ప్రిన్సీని హైదరాబాద్ తరలించగా.. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తరుణ్, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుశీల మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. క్షతగాత్రుల్లో వినోద్, వరుణ్, లింసీ ఖమ్మంలో, ప్రిన్సీ హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.


సుశీల (ఫైల్)


తరుణ్ (ఫైల్)

ఆర్తనాదాలు

గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగిసి పడటంతో గాయపడిన వారు ఆర్తనాదాలు చేశారు. ఒళ్లంతా కాలిపోయి చర్మం ఊడుతుండగా ఆస్పత్రికి తరలించే సమయాన చిన్నారులు బాధ తట్టుకోలేక తమను కాపాడాలని వేడుకోవడం స్థానికులను కలిచివేసింది. అయితే, గ్యాస్ సిలిండర్ అయిపోగానే కట్టెల పొయ్యి అంటించడం.. అది మండుతుండగానే కొత్త సిలిండర్ అమర్చే క్రమాన లీకేజీతో ప్రమాదం జరిగింది. ఒకవేళ కట్టెల పొయ్యి లేకపోతే ప్రమాదం జరగకపోయేదని స్థానికులు తెలిపారు.

నిరుపేద కుటుంబం

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబానికి చెందిన వినోద్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. కొన్నాళ్లుగా సుతారి పనులకు వెళ్తున్నాడు. ఆయనకు ఇద్దరు కవల కుమారులు ఉండగా, వేసవి సెలవులు కావడంతో సోదరి లావణ్య పిల్లలైన ప్రిన్సీ, లింపీ్స కూడా వచ్చారు. ప్రస్తుతం వినోద్, ప్రిన్సీ, లింపీ్స, వరుణ్, వినోద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడం.. వినోద్ నాయనమ్మ, కుమారుడు మృతి చెందడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, వినోద్‌కు ఆయన కుమారుడు, నాయనమ్మ మృతి విషయం తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఖమ్మంలో చికిత్స పొందుతున్న వినోద్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పరామర్శించి వైద్యులతో మాట్లాడారు.

సొసైటీ చైర్మన్, సీఈఓ నిర్బంధం

ఆ తర్వాత గన్నీ సంచులు తీసుకెళ్లిన రైతులు


సొసైటీ షెట్టర్ వేస్తున్న రైతులు

వైరారూరల్: రోజుల తరబడి ధాన్యం ఆరబోసి వేచిచూస్తున్న రైతులకు గన్నీ సంచులు ఇవ్వకపోవడంతో సొసైటీ కార్యాలయంలో చైర్మన్, సీఈఓ సహా ఉద్యోగులను నిర్బంధించి నిరసన తెలిపారు. ఆతర్వాత కాసేపటికి వారిని వదిలేసి సంచులు తీసుకెళ్లిన ఘటన వివరాలిలా ఉన్నాయి. వైరా మండలం గరికపాడు సొసైటీ కార్యాలయానికి పది వేల ఖాళీ గన్నీసంచులు రావడంతో పలువురు రైతులు తమకు ఇవ్వాలని కోరారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలు అందేవరకు ఎవరికీ ఇవ్వబోమని, ఇప్పటికే కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాకే ఇస్తామని సిబ్బంది బుదలిచ్చారు. దీంతో రైతులు ఆగ్రహానికి గురై కార్యాలయంలో చైర్మన్ అయిలూరి కృష్ణారెడ్డి, సీఈఓ రామకృష్ణ, సిబ్బంది ఉండగానే షట్టర్ వేశారు. ఆ కాసేపటికే షట్టర్ తీసి.. ఖాళీ బ్యాగ్‌లు తీసుకెళ్లారు. సొసైటీ పరిధిలోని గ్రామాల్లో 12,328 బస్తాలు ఐదు రోజులుగా రోడ్ల వెంట, కల్లాల్లో ఉన్నాయి. ఇవన్నీ మిల్లులకు తరలించాకే రైతులకు గన్నీ బ్యాగ్‌లు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. కానీ రైతులు మాత్రం రోజుల తరబడి ధాన్యం ఆరబోసి ఎదురుచూస్తున్నందున బ్యాగ్‌ల్లో నింపి భద్రపర్చుకుంటామని తీసుకెళ్లారు. ఈ విషయంలో సొసైటీలో ఎవరిపైనానా చర్యలు తీసుకుంటే తాము బాధ్యత వహిస్తామని రైతులు నచ్చచెప్పడం గమనార్హం.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ..

- ఒకరు మృతి.. ఏడుగురికి గాయాలు
- క్షతగాత్రుల్లో దక్షిణ కొరియా దేశస్తులు


ఘటనా స్థలంలో క్షతగాత్రులు


దక్షిణ కొరియా దేశస్తులు

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ సమీపంలో తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి కారులో దక్షిణ కొరియా దేశస్తులు ముగ్గురు, హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి, డ్రైవర్‌తో (ఐదుగురు) బయలుదేరి భద్రాచలం వెళ్తున్నారు. ఆళ్లపల్లి మండలం రామాంజిగూడెంనకు చెందిన వానపాకుల సాంబశివరావు (24), భార్య సంధ్య, మరదలు శ్రీలత ఏపీ రాష్ట్రం కుక్కునూరు మండలం వెలేరుకు పెళ్లికి వెళ్లి తిరిగి కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. సాంబశివరావు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వినోభానగర్ గ్రామం దాటిన తరువాత ఈ రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. వానపాకుల సాంబశివరావు తీవ్రంగా గాయపడగా.. సంధ్య, శ్రీలతకు గాయాలయ్యాయి. దక్షిణ కొరియా పర్యాటకులు సంకిమ్, థసిన్, సైకిమ్, హైదరాబాద్‌కు చెందిన సాల్మన్ రాజు, డ్రైవర్ దర్శికుమార్‌లకూ గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, క్షతగాత్రులను 108 ద్వారా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాంబశివరావు మృతి చెందాడు. మెరుగైన వైద్యం కోసం దక్షిణ కొరియా పర్యాటకులను ఖమ్మం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాదావత్ రవి పేర్కొన్నారు.

ఆరు మట్టి టిప్పర్ల పట్టివేత


పట్టుబడిన టిప్పర్లు

పాల్వంచరూరల్: అర్ధరాత్రి గుట్టుగా మట్టిని తరలిస్తున్న ఆరు టిప్పర్లను రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు. తహసీల్దార్ వివేక్ కథనం ప్రకారం.. మొర్రేడువాగు ఎగువభాగంలో ఉన్న గుడిపాడు సమీపం నుంచి సోమవారం అర్ధరాత్రి మట్టిని ఆరు టిప్పర్లలో పాల్వంచకు తరలిస్తున్నారు. సమాచారం అందడంతో ఆర్ఐలను ఘటనా స్థలానికి పంపగా అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ఆరు టిప్పర్లను పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, వాహనాలకు జరిమానా విధించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

దమ్మపేట: పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని మందలపల్లిలో చోటుచేసుకోగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన కుప్పాల శ్రీను (24)కు గతేడాది వివాహం కాగా ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో అతడి తండ్రి, భార్య ఈ నెల 27న మందలించగా.. శ్రీను పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు సత్తుపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి. .అక్కడి నుంచి ఏపీలోని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న బాలిక మృతి

దుమ్ముగూడెం: మండలంలోని జడ్.వీరభద్రారం గ్రామానికి చెందిన బాలిక పురుగులమందు తాగి.. భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. బాలిక 5 రోజుల కిందట పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి బాలిక మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువతి..

సుజాతనగర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి మృతి చెందిన ఘటనపై సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ రమాదేవి కథనం మేరకు.. మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన ఓ యువతి రెండేళ్ల కిందట పదో తరగతి ఫెయిల్ అవ్వడంతో చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటోంది. పొలం పనికి రావడం లేదు.. ఇంట్లో పని కూడా చేయడం లేదంటూ ఈ నెల 14న ఆమెను తన తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన యువతి పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి మృతికి కారణమైన యువకుడికి జైలు

భద్రాచలంఅర్బన్: ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టి ఓ వ్యక్తి మరణానికి కారకుడైన వ్యక్తికి 16 నెలల జైలుశిక్ష విధిస్తూ భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ మంగళవారం తీర్పు చెప్పారు. 2014, అక్టోబర్ 31న దుమ్ముగూడెంనకు చెందిన పూర్ణచందర్‌రావు తన భార్య భవానితో కలిసి చిన్ననల్లబెల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తూ మధ్యలో ఆగాడు. ఈ క్రమంలో పర్ణశాల నుంచి లక్ష్మీనగరం వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న వరక మహేశ్ ఆగి ఉన్న పూర్ణచందర్‌రావు బైక్‌ను వేగంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన పూర్ణచందర్‌రావు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వరక మహేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి శివనాయక్ 16 నెలలు జైలు శిక్షతో పాటు రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఇల్లెందురూరల్: ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రానికి చెందిన వేల్పుల రాజు ఈ నెల 26న మాణిక్యారం నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో ఇల్లెందు నుంచి మాణిక్యారం వెళ్తున్న బొలేరో వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో రాజు తీవ్రంగా గాయపడ్డాడు. నాటి నుంచి ఖమ్మంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజు తండ్రి రాంమ్మూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు కొమరారం ఎస్ఐ నాగుల్‌మీరా మంగళవారం తెలిపారు.

సెంట్రల్ లైటింగ్‌ను ఢీకొట్టిన లారీ

లారీ కిందకు వెళ్లిన స్కూటీ.. తప్పిన ప్రాణాపాయం

పాల్వంచ: బీసీఎం రహదారిపై ఓ బొగ్గు లారీ మంగళవారం రాత్రి సెంట్రల్ లైటింగ్‌ను ఢీకొట్టింది. స్థానికుల కథనం మేరకు.. కొత్తగూడెం వైపు నుంచి పాల్వంచకు బొగ్గు లారీ వస్తూ బీసీఎం రహదారిలో ఒడ్డుగూడెం క్రాస్ రోడ్డు వద్ద పక్కకు దూసుకు పోయి, సెంట్రల్ లైటింగ్ స్తంభం, హోర్డింగ్‌ను ఢీకొంది. సెంట్రల్ లైటింగ్ స్తంభం కూలింది. మరోవైపు స్కూటీపై వస్తున్న ఓ వ్యక్తి లారీ వస్తున్న విషయాన్ని గుర్తించి స్కూటీని వదిలి పక్కకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది. స్కూటీ లారీ టైర్ల కిందపడి నుజ్జునజ్జయింది. పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖాధికారులు అక్కడికి వచ్చి పరిశీలించారు.


లారీ ఢీకొట్టడంతో కూలిన సెంట్రల్ లైటింగ్ స్తంభం

IV
సాక్షి ఫ్యామిలీ
ఖమ్మం
బుధవారం ॥ 30-4-2025

'వంక'లు లేవు వాగులు లేవు... చెప్పడానికి సాకులు లేవు.
వేసవి సెలవులు వచ్చేశాయి.
సోషల్ మీడియా బందీఖానా నుంచి పిల్లలను ఇప్పుడు రిలీజ్ చేయాలి.
పుస్తకాలకు దగ్గరగా తీసుకురావాలి.
విక్రమార్కుడి సింహాసనం ఎక్కిస్తే కథల దర్బారులోకి వారే ప్రవేశిస్తారు.
వేసవి సెలవుల్లో ఉన్న 50 రోజుల్లో
పిల్లలు పుస్తకాలు ఎందుకు చదవాలి, ఏవి చదవాలి?
వేసవి శీర్షిక 'వేసవి కాలమ్'లో మొదటి కథనం.



సెలవులొచ్చాయి

ఆడించండి... చదివించండి..



పిల్లలకు బడి గంట ఇష్టమే. కాని స్కూల్ మొదలయ్యేప్పుడు కొట్టే గంట కంటే స్కూల్ వదిలేప్పుడు కొట్టే గంట ఎక్కువ ఇష్టం. ఆ గంట వినపడగానే పుస్తకాలు తీసుకుని క్లాస్ నుంచి పరిగెత్తుతారు. కొందరు ప్లేగ్రౌండ్‌కు వెళతారు. కొందరు ఇంటికి చేరి వెంటనే చుట్టుపక్కల ఫ్రెండ్స్‌ను పోగేస్తారు. ఎందుకు? ఇంకెందుకు... ఆటలు ఆడటానికి.

ఇంట్లో నుంచి అమ్మ పిలుస్తున్నా... ఏదైనా తిని వెళ్లమని అరుస్తున్నా పిల్లలు లెక్క చేయరు. ఆడుతుంటారు. ఆడుతూ అరుస్తూ ఉంటారు. నవ్వుతూ ఉంటారు. పేచీ పెడుతూ ఉంటారు. ఓడుతూ ఉంటారు. గెలుస్తూ ఉంటారు. ఇవన్నీ చేస్తూ చెమట చిందిస్తూ ఉంటారు.

పిల్లలూ చెమటా కవలలు.

నేడు... పిల్లలకు చెమటే లేదు. ఎందుకు? ఎందుకంటే వాళ్లు ఆడటం లేదు కాబట్టి. ఆడే బదులు ఓ.టి.టి.లో, కంప్యూటర్లో, సోషల్ మీడియానో తమ బాల్యంతో ఆటలాడుకోవడానికి వీలు కల్పిస్తున్నారు కాబట్టి.

దొంగ... పోలీస్

'దొంగ పోలీస్' ఆట అందరికీ తెలుసు. ఇవాళ దొంగ పోలీస్ ఆట ఎంతమంది పిల్లలకు తెలుసు? ఎంత సింపుల్ ఆట ఇది! ఐదారు మంది పిల్లలు కలిసి పంటలు వేసి గెలుస్తారు. ఆఖరున మిగిలినవాడు పోలీస్ అయ్యి గోడ వైపు తిరిగి వంద లెక్కబెడతాడు. ఈ లోపు పిల్లలు దాక్కుంటారు. ఆ దాక్కున్న వాళ్లను పోలీస్ కనిపెట్టాలి. కనిపెట్టలేకపోతే పోలీస్ ఓడిపోతాడు. ఈ ఆట ఆషామాషీ ఆటనా? పిల్లల మెదడుకు తర్ఫీదు ఇస్తుంది. ముమ్ముందు జీవితంలో తారసపడబోయే వారిలో ఎవరు దొంగ.. ఎలాంటి దొంగ... వాడి వ్యవహార శైలి ఎలా ఉంటుంది... ఎవరు ఏ మేరకు తప్పించుకోలరు... అదొక్కటేనా? మన వ్యక్తిత్వంలో దొంగ పనులు ఎలా చోటు చేసుకుంటున్నాయి... వాటిని వెతికి పట్టుకొని జైలుకు పంపితే ఎంత మంచి విద్యార్థులం కాగలం... అసలు దొంగలా దాక్కునే బతుకు ఎంత నీచమైనది.... ఇవన్నీ పైకి చెప్పకనే నేర్పిస్తుంది.

ఇవాళ్టి పిల్లలకు కామిక్ హీరో, యూట్యూబ్ గేమర్ తెలుసుకాని దొంగ పోలీస్ తెలీదు. పైగా పిల్లలు ఆ ఆట ఆడుతూ కనిపిస్తే పెద్దలే నవ్వి, జోకులేసి 'మరీ ఈ ఆటలా' అని ఆపించేలా ఉన్నారు.

ఆట లేకుంటే ఆందోళన

పిల్లలు ఆడేందుకు పుట్టారు. ఆడి ఆడి వారు పెద్దవాళ్లవ్వాలి. ఆటకు దూరమయ్యి కాదు. 'పిల్లల చైల్డ్‌హుడ్ యాంగ్జయిటీకి వారు ఆటలకు దూరం కావడమే కారణం' అంటారు జోనాథన్ హైడ్ అనే సోషల్ సైకాలజిస్టు. ఆటకు బదులు టీవీ, కంప్యూటర్, సోషల్ మీడియాకు బానిసైన ఏ పిల్లవాడైనా దృష్టి చెడి, నిద్ర చెడి, కల్మషం నింపే కలకలం రేపే కంటెంట్‌ను చూసి ఆందోళనకు గురవుతాడు. కదలిక లేని మెదలిక లేని కుర్చీలో కూలబడి కేవలం మెదడుకు ఒత్తిడి ఇవ్వడం ద్వారా మెదడుతో పాటు శరీరం కూడా శుష్కమయ్యి మెదడకు తగిన శక్తి ఇవ్వడంలో వెనుకబడుతుంది.

వివాదాల ఇల్లు

అయితే తల్లిదండ్రులు చాలా నియమాలు పెట్టాలని చూస్తారు. టీవీ ఆఫ్ చేస్తారు. రౌటర్ కట్ చేస్తారు. ఓటీటీ రెన్యువల్ చేయరు. ఈ తల్లిదండ్రులే కోవిడ్ కాలంలో ఇవన్నీ అలవాటు చేశారు. ఇప్పుడు వద్దంటే పిల్లలు మానుతారా? ఆటలు ఆడి శ్రమ చేయడానికి ఇష్టపడకపోగా కుర్చీలో కూలబడి పొందే వినోదం కోసం తల్లిదండ్రులతో ఘర్షణ పడుతూ ఉంటారు. దాంతో ఇంట్లో అశాంతి నిండిపోతుంది. అందుకే జోనాథన్ హైడ్ ఏమంటారంటే ముందు పిల్లలకు పుస్తకాలు అలవాటు చేయండి. తర్వాత ఆటల్లోకి తీసుకురండి అని.



కట్టెల మోపు కథ

చనిపోయే ముందు ఒక తండ్రి తన నలుగురు కొడుకులకు ఒక్కొక్క కట్టె ఇచ్చి విరవమంటాడు. వాళ్లు విరుస్తారు. ఇప్పుడు నలుగురి చేతుల్లో ఉన్న కట్టెలను మోపుగా కట్టి విరవమంటాడు. కొడుకులు విరవలేకపోతారు. 'కలిసి ఉంటే ఇలా బలంగా ఉంటారు' అని చనిపోతాడు తండ్రి. కొడుకులు ఆ ఐకమత్యాన్ని పాటిస్తారు. కథలు ఎన్నో విషయాలు చెబుతాయి. నేర్పుతాయి. సూక్ష్మబుద్ధిని చూపుతాయి. సమస్యలు ఎదురైతే తెనాలి రామలింగడిలా దొంగల చేతే బావిలోని నీళ్లన్నీ చేదించి పాదులు తడుపుకునే తెలివితేటలను ఇస్తాయి. భారతదేశంలో నుంచి ప్రపంచం కథలను తీసుకుంటే మన పిల్లలకు మనం కథలను దూరం చేస్తున్నాం. పిల్లల నిపుణులు ఏమంటారంటే బొమ్మలున్న కథల పుస్తకాలు చిన్న పిల్లలకు కామిక్స్, గ్రాఫిక్ నవలలు టీనేజర్లకు ఇచ్చి వారికి పుస్తకాలు అలవాటు చేయమని. పుస్తకం చదివిన పిల్లలు ఆ కథను తోటి పిల్లలతో పంచుకోవాలనుకుంటారు. నలుగురు పిల్లలూ కథలు చెప్పుకోవడానికి కూడతారు. ఆ తర్వాత? ఆడుకుంటారు. ఇదీ ఆరోగ్యకరమైన బాల్యం అంటే.

క్లాసులు... స్పెషల్ క్లాసులు...

ఆటల బదులు మార్కులు, సాటి పిల్లలకు బదులు ట్యూషన్ క్లాసులు చుట్టుముట్టి పిల్లలను ఆందోళనలోకి నెడుతున్నాయి. కాలూ చేయీ కదపని దేహం బుద్ధిని ఎలా కదుపుతుంది? ఫిట్‌గా లేని శరీరం ర్యాంకులు ఎలా తెస్తుంది? ఆటలో పడి లేస్తారు పిల్లలు. అది అలవాటైతే చదువులో పడినా లేవడం తెలుసుకుంటారు. లేదా లేవడానికి కథల్లో చదివిన ఒక ఉదాత్త నాయకుడిని తోడు తెచ్చుకుంటారు. ఆటపాటలు లేకపోవడం వల్లే నేడు పిల్లలు ర్యాంకు రాకపోయినా ఫెయిల్ అయినా చాలా దూరం పోతున్నారు.

సెలవులొచ్చాయి.
ఆడించండి. చదివించండి.

– కె.

బ్యూటిప్స్

మూడు టేబుల్ స్పూన్స్ మేర సగ్గు బియ్యం తీసుకోవాలి. అంతకు ముందే వాటిని ఓ కప్పు నీటిలో ఉడకబెట్టాలి. అయితే.. ఫేస్ మాస్క్ తయారీ కోసం వీటిని ఆ నీటితో పాటు వాడాలి. ఈ మాస్క్ లో అన్నం కూడా కలపాలి. రెండు మూడు టేబుల్ స్పూన్స్ అన్నాన్ని తీసుకోవాలి. ఆ తరవాత ఓ టేబుల్ స్పూన్ శనగపిండి, ఓ టేబుల్ స్పూన్ బంక మట్టి, ఓ టేబుల్ స్పూన్ తేనె అందుబాటులో ఉంచుకోవాలి. చివరగా మూడు నుంచి నాలుగు టేబుల్ స్పూన్స్ రోజ్ వాటర్ నీ తీసుకోవాలి. వీటన్నింటినీ ఓ మిక్సీ జార్ లో వేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్ లా వేసుకుని ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు లేదా మూడు సార్లు చేస్తూ ఉంటే ముఖం మిలమిలలాడుతుంది.



లీగల్

ష్యూరిటీ ఇచ్చేముందే జాగ్రత్త పడాలి

నా స్నేహితుడు ఒక ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలో డబ్బు తీసుకునేటప్పుడు నేను హామీ (ష్యూరిటీ) ఇచ్చాను. ఇప్పుడు అతను పరారీలో ఉన్నాడు. చిట్‌ఫండ్ వారు నాపై కేసు వేశారు. ఆ మొత్తం నేను కట్టవలసిందేనా?

– రాహుల్, ఖమ్మం

ష్యూరిటీ ఇమ్మని మిమ్మల్ని ఎవరూ బలవంతం చేయలేదు కదా! ష్యూరిటీ ఇచ్చిన తర్వాత మీరు ఎంత మొత్తానికి హామీ ఇచ్చారో అంత మొత్తం మీ వద్ద నుండి వసూలు చేస్తారు. వాయిదా పద్ధతుల్లో చెల్లించవచ్చు. మీ స్నేహితుడికి ఏవైనా ఆస్తులు ఉంటే అవి జప్తు చేయవలసినదిగా కోరవచ్చు. అలాంటివి ఏమైనా ఉన్నాయేమో చూడండి. ష్యూరిటీ ఇచ్చేముందు జాగ్రత్త వహించడం మంచిది. నమ్మకస్తులకి, డబ్బు తిరిగి చెల్లించే స్థితి ఉన్న వారికి మాత్రమే ష్యూరిటీ ఇవ్వడం మంచిది.

నేను ఒక ప్రైవేటు సంస్థలో చిట్టీ కట్టాను. మొత్తం 50 నెలలు కట్టాలి కానీ నా పరిస్థితులు బాగుండక 15 నెలలు మాత్రమే కట్టాను. చిట్టీ ఎత్తలేదు. నేను కట్టిన డబ్బు నాకు తిరిగి రావాలంటే ఏం చేయాలి?

– సుందర్, హైదరాబాద్

చిట్టీ కట్టడాన్ని మధ్యలోనే ఆపేయడం తరచుగానే చూస్తుంటాం. మంచి సంస్థలలో అయితే లిఖితపూర్వక హామీపత్రాలు (అగ్రిమెంట్) ఉంటాయి కాబట్టి, అందులోని ఒప్పందం ప్రకారం కొంత జరిమానా విధించి మీరు అప్పటివరకు కట్టిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తుంటారు. కొన్ని సంస్థలు అయితే చిట్టీ గడువు పూర్తిగా ముగిశాక లేదా మీ బదులు ఇంకెవరైనా మీ గ్రూపు చిట్టీలో కలిస్తే కొంత కమీషన్ తీసుకొని డబ్బు తిరిగి ఇస్తుంటారు. ఏది ఏమైనా, మీరు కట్టినన్ని డబ్బులు మీకు రావు కానీ పూర్తి నష్టం మాత్రం ఉండదు. మీరు చిట్టీ కట్టిన సంస్థని సంప్రదించి క్యాన్సిలేషన్ అడగండి. వారి నిబంధనల మేరకు వారికి రావలసిన మొత్తాన్ని మినహాయించుకుని మిగిలినది ఇస్తారు.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

* జెండర్ ఈక్వాలిటీ

ప్లంబర్లుగా మహిళా శక్తి!

లింగ సమానత్వం కార్పొరేట్ రంగాల్లో కాదు శ్రామిక శక్తిలో చూపాలి అని నిరూపిస్తోంది జోర్డాన్ మహిళ. జోర్డాన్‌లో వందలాది మహిళలు ప్లంబర్లుగా విధులను నిర్వహిస్తున్నారు. మొదట్లో దీనిని అవమానకరంగా భావిస్తూ వీరి పనులపై గతంలో నిషేధం విధించారు. అక్కడి సామాజిక, సాంస్కృతిక నిబంధనల కారణంగా మహిళలు శ్రామిక శక్తిలోకి ప్రవేశించడం ఒక సవాల్‌గా ఉంది. ఇప్పుడు ఆ అనిశ్చితి తొలగి, జోర్డాన్‌లో మహిళా ప్లంబర్లపై ప్రభుత్వం నిషేధాన్ని తొలగించింది. 2006లో మొట్టమొదటి లైసెన్స్ పొందిన మహిళా ప్లంబర్ ఖవ్లా షేక్ ఈ పనిలోకి ఎక్కువ మంది మహిళలు వచ్చేలా ప్రోత్సహిస్తుండగా, 2014లో ఏర్పడిన వైజ్ ఉమెన్ ప్లంబర్స్ కో ఆపరేటివ్ ఈ రంగంలో లింగసమానత్వం సాధించడానికి కృషి చేస్తోంది. జోర్డాన్ సంప్రదాయ కట్టుబాట్ల కంచెను తొలగించుకుంటూ అక్కడి మహిళ తన ఉనికికోసం చేస్తున్న కృషి ప్రపంచం దృష్టిని ఆకట్టుకునేలా చేస్తోంది.

'స్త్రీ ఉద్యోగం చేయకూడదు, అది కుటుంబానికే అవమానం. అటువంటిది మరీ చోద్యం కాకపోతే పురుషులకు దీటుగా చేసే ఆ పనులేంటి..!?' తహానీ ఆల్ షాతి, యుస్రా మోహమ్మద్ నోమర్.. వంటి వాళ్లు ప్లంబర్లుగా శిక్షణ ప్రారంభించినప్పుడు ఇలాంటి ఎన్నో మాటలు తమ సాటి వారి నుంచి వచ్చినవే. జోర్డాన్‌లో సామాజిక, సాంస్కృతిక నిబంధనల కారణంగా జీతంతో కూడిన పనిలో మహిళల నిష్పత్తి ప్రపంచంలోనే అత్యల్పంగా ఉంది. శ్రామిక శక్తిలోకి ప్రవేశించడం ఇప్పటికీ చాలామంది మహిళలకు అతిపెద్ద సవాల్.



సమర్థతే సరైన ఔషధం

ప్లంబర్లుగా శిక్షణ తీసుకుంటున్న తొలి రోజులను అల్‌షాతి గుర్తుచేసుకుంది. శిక్షణ తీసుకుంటున్న ఇతర మహిళలు వీధిలో నీళ్ల లీక్ అవుతున్న పైపును చూశారు. లీకేజీని ఆపడానికి తమ వద్ద గల ఉపకరణాలను బయటకు తీశారు. దారిన పోతున్న ఒక మహిళ వారిని చూసి 'మీరేంటి ఈ పనులు చేయడమేంటి?' అని తిట్టడం మొదలుపెట్టింది. దాంతో అక్కడ ఇంకొంతమంది పోగయ్యారు. వాళ్లు కూడా అవే మాటలు.. అవేమీ ఈ శిక్షణ తీసుకుంటున్న బృందం పట్టించుకోలేదు. నీళ్ల లీకేజీని ఆపాలనుకున్న పనిని సమర్థంగా పూర్తిచేశారు. నీటినష్టాన్ని నివారించారు. దీంతో అక్కడున్న వారి నోళ్లు మూతపడ్డాయి. తమలో తాము గొణుక్కుంటూ అక్కడినుంచి వెళ్లిపోయారు. ఇప్పుడు అక్కడ అల్ షాతి, నోమర్ లాంటి వందలాది మహిళా సర్టిఫైడ్ ప్లంబర్లు ఉన్నారు.

రాజధాని నగరమైన అమ్మాన్‌లోని ఈ మహిళలంతా 'ఈ అసాధారణ కెరీర్ మా జీవితాలనే మార్చిందని, ఆత్మవిశ్వాసం, స్వాతంత్య్రాన్ని అందించిందని, ఇతర మహిళలకు శిక్షణ ఇస్తూ తమ దేశాన్ని పర్యటించే అవకాశాలను కల్పించిందని' ముక్త కంఠంతో అంటున్నారు. 'నా భర్త, పిల్లలు నన్ను చూసి చాలా గర్వపడుతుంటారు. నా పొరుగువారు నన్ను చూసి అసూయపడుతున్నారు' అని నోమర్ చెబుతుంది.

భిన్నమైన సేవ

జోర్డాన్‌లో నీటి కొరత పెద్ద సమస్య. ఇందుకు భౌగోళిక, పర్యావరణ పరమైన కారణాలు మొదటివి కాగా, నీటిని దొంగిలించడం అనేది మరో ముఖ్యమైన కారణం.

అందుకే జోర్డాన్‌లో మహిళల కోసం అనేక ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా నీటి పొదుపు కోసం రకరకాల ఉపకరణాలను బిగించడంలో మహిళలకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. నీటి వనరుల నిర్వహణలో మహిళలను పాల్గొనేలా చేయడం మంచి నిర్ణయమని నీటి, పారిశుధ్య సలహాదారు హింద్ అల్లెఫాత్ పేర్కొన్నారు. ఎందుకంటే నీటి ప్రాముఖ్యత గురించి వారికే ఎక్కువ తెలుసు. ఈ మేరకు వారు యువత, వృద్ధులలో అవగాహనను తీసుకు రాగలరు. ఈ కోణంలో చూసినపుడు వారు తల్లులే కాదు, టీచర్లు కూడా!

ఆర్థిక భద్రత

అల్ షాతి, నోమర్ తో సహా కొంతమంది మహిళా ప్లంబర్లు 2014లో వైజ్ ఉమెన్ ప్లంబర్స్ కో ఆపరేటివ్ కార్యక్రమంలో చేరారు. కలిసి పనిచేయడం వల్ల భద్రత, ఆర్థిక స్థిరత్వం, అలాగే పెద్ద ప్రాజెక్టులను లీడ్ చేసే అవకాశాలు లభిస్తాయనేది వీరి ఆలోచన. ఇందులోని సభ్యులు తమ చుట్టుపక్కల ఇళ్లకు వెళ్లి ఉచిత సర్వీస్ అందిస్తున్నారు.

మొదటిసారి 2004లో 15 మంది మహిళలతో కలిసి శిక్షణ తీసుకున్నప్పుడు 'సంస్కృతికే అవమానం' అనే కారణంగా ఇతరులెవరూ దానిని ఆమోదించలేదు. కానీ, ''నేడు ఈ పని రాని వారు కూడా సాధారణ మరమ్మతులు చేయడం నేర్చుకుంటే ఇండ్లలో తమ ప్లంబర్ పనిని తామే చేసుకోవచ్చు' అని వివరిస్తూ తోటి మహిళలనూ ప్రోత్సహిస్తున్నారు. ఇలా ప్లంబర్ పనిచేసే ఈ మహిళలంతా చాలా కాలంగా తమ సమాజంలోని నిబంధనలను సవాల్ చేస్తూ తమ ఉనికిని చాటుతున్నారు. లింగ సమానత్వాన్ని కాపాడుకున్నారు.



● పర్యావరణ హిత

ఈ చిత్రాన్ని మీకు సమర్పిస్తున్న వారు...

నోరు లేని మూగజీవాలు, విలువైన ప్రకృతి గురించి చెప్పడానికి ఎన్నో కథలు ఉన్నాయి. వాటికి చిత్రరూపం ఇవ్వడానికి, మహిళలలోని సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, వారిని డైరెక్టర్లుగా తీర్చిదిద్దడానికి 'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' అనే స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది.

కోల్‌కత్తాకు చెందిన అశ్వికాకపూర్ బీబీసి నేచురల్ హిస్టరీ యూనిట్ డైరెక్టర్. పశ్చిమబెంగాల్ అడవుల్లో 'వణ్యప్రాణుల వేట' పేరుతో ఉత్సవాలు చేస్తారు, ఇందులో పిల్లలు కూడా పాల్గొంటారు. దీనిపై ఆమె 'క్యాటపల్ట్స్ టు కెమెరాస్' చిత్రాన్ని తీసింది. ఈ చిత్రం న్యూయార్క్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ స్ఫూర్తిదాయక చిత్రంగా అవార్డు గెలుచుకుంది.

అశ్వికాలాంటి ఎంతోమంది మహిళా దర్శకుల విజయానికి 'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' దారి చూపింది.



'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ద్వారా వణ్యప్రాణుల గురించి వీలైనంత ఎక్కువగా తెలుసుకునే అవకాశం వచ్చింది. ఎప్పుడూ వినని అరుదైన జీవులు గురించి కూడా తెలుసుకున్నాను. వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌మేకర్‌గా ఇది నాకు ఎంతో ఉపయోగపడుతుంది' అంటుంది అశ్వికాకపూర్.

పిల్లల జీవితాలను మార్చింది

వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీ, చిత్రాల ద్వారా వేటకు వెళ్లే పిల్లల మనస్తత్వాలను మార్చాం. ఇప్పుడు వారు అడవి జంతువులను 'వేట కోసం' అన్నట్లుగా చూడడం లేదు. సంరక్షించుకోవాల్సిన అందమైన జీవులుగా చూస్తున్నారు. మా చిత్రనిర్మాణ ప్రక్రియ వన్యప్రాణులను కాపాడడమే కాదు పిల్లల జీవితాలను కూడా మార్చింది. తమ చుట్టూ ఉన్న సహజ ప్రపంచంతో కనెక్ట్ కావడానికి వారికి ఇది కొత్త మార్గాన్ని చూపించింది.

– నేహా దీక్షిత్, ఫిల్మ్‌మేకర్

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' సంస్థను సియాటిల్‌కు చెందిన పారిశ్రామికవేత్త, దాత గుర్‌ప్రీత్ సన్నీసింగ్ స్థాపించారు. వణ్యప్రాణులపై విలువైన కథలు వెండితెరపై చెప్పడానికి వీలుగా ఇది మహిళా కథకులకు ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఫిల్మ్స్ దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ఫిల్మ్‌మేకర్స్‌తో కలిసి పని చేస్తోంది. ఫండింగ్ నుంచి దర్శకులకు మార్గనిర్దేశం చేయడం వరకు రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఎన్నో చేస్తుంది' అంటుంది రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఫిల్మ్స్ క్రియేటివ్ డైరెక్టర్, ఫిల్మ్‌మేకర్ సమీన్ ఫారూఖీ.

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' నిర్మాణ సంస్థ తన వెబ్‌సైట్ ద్వారా సినిమాలను విడుదల చేస్తుంది.

వారే నిజమైన హీరోలు

భూగోళ సంక్షోభం గురించి నిరాశపడడం కంటే కార్యాచరణ అనేది ముఖ్యం. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది సంరక్షకులు, శాస్త్రవేత్తలు, రేంజర్ల రూపంలో ఆశ కనిపిస్తుంది. వారు నిజమైన హీరోలు. ఈ హీరోలు మన భూగోళాన్ని సురక్షితంగా ఉంచడానికి అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. వారి అంకితభావం మన ఆశావాదానికి బలాన్ని ఇస్తుంది. ఆ ఆశావాదాన్ని దశదిశలా వ్యాప్తి చేయడం ఫిల్మ్‌మేకర్‌గా నా బాధ్యత.

– అశ్వికా కపూర్, ఫిల్మ్‌మేకర్

సినిమాలను ప్రమోట్ చేయడానికి టీమ్ విస్తృతంగా మార్కెటింగ్ కూడా చేస్తుంది.

దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఆన్‌లైన్ స్క్రీనింగ్‌లు నిర్వహిస్తారు.



'విస్మరించబడిన కథలను వెలుగులోకి తీసుకురావాలనుకుంటుంది. పెద్దగా ఎవరికీ తెలియని ఆవాసాలు, పర్యావరణ వ్యవస్థలు, జాతులకు ప్రాధాన్యత ఇస్తోంది. దీనికి తోడు లోకల్ ఫిల్మ్‌మేకర్స్‌పై దృష్టి పెట్టింది. సహజ ప్రపంచం గురించి మాట్లాడడానికి మల్టీ మీడియా విధానాన్ని ఉపయోగిస్తోంది. ఫోటో స్టోరీలు, ఇన్ఫోగ్రాఫిక్స్, వ్యాసాలు, కార్టూన్లు ఇందులో ఉంటాయి. కథలను సంచలనం కోసం చెప్పాలనుకోవడం లేదు. స్పష్టంగా చెప్పాలనుకుంటుంది' అని రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ గురించి చెబుతోంది సమీన్.

ఇంటిప్స్

కిచెన్ నైఫ్ పదును పోయిందా...

అప్పుడప్పుడు వంటగది చాకులు పదును లేకుండా కూరగాయలు కోయడానికి విసిగిస్తూ ఉంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు చిన్న చిట్కాలున్నాయి.



- పదును పెట్టే రాయి.. పదును పెట్టే రాయిని ఒక్కసారి కొనేసుకుంటే అది ఎప్పటికీ పనిచేస్తుంది. కత్తులు, చాకులు ఇలా వేటినైనా ఈజీగా పదును పెట్టచ్చు. మనీ సేవ్ చేయడమే కాదు. సమయం కూడా వృథా కాదు.
- నైఫ్ షార్ప్‌నర్.. ఎలక్ట్రిక్, మాన్యువల్ కత్తి షార్ప్‌నర్లు సౌకర్యవంతంగా ఉంటాయి. మరీ ఎక్కువ పదును లేకుండా చూసుకుంటూ పదును పెట్టాలి.
- చాకుల్ని పొడిగా ఉంచాలి.. తేమ తుప్పు పట్టేలా చేస్తుంది. కూరగాయలు కోయడం అయిపోయాకా కత్తుల్ని కాగితం, తువ్వాళ్లలో కట్టి ఆరనీయాలి.
- చాపింగ్ బోర్డ్.. గాజు, గ్రానైట్ లేదా సిరామిక్ ప్లేట్లలో కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను కట్ చేయడం వల్ల చాకులు ఇట్టే పదును పోతాయి. ఈ పదును ఎక్కువ కాలం ఉండాలంటే చెక్క వస్తువు మీదనే కట్ చేసేలా చూడాలి.
- కటింగ్ టెక్నిక్.. చాకు మీద ఒత్తిడి తగ్గించి సరైన కటింగ్ మెథడ్స్ పాటిస్తూ కట్ చేయడం వల్ల పదును తగ్గే అవకాశాలు తక్కువగా ఉంటాయి.